స్తంభం.. ప్రమాదకరం..



లారీలు, వినియోగ దారులు, హమాలీలు, చాట్‌ కార్మికులతో నిత్యం రద్దీగా ఉండే మలక్‌పేట గంజిలో ఓ విద్యుత్‌ స్తంభం ప్రమాదకరంగా మారింది. గత ఆరు నెలల నుంచి సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తుప్పు పట్టిన విద్యుత్‌ స్తంభంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. –చాదర్‌ఘాట్‌

డైలీ.. ట్రాఫిక్‌ లొల్లి



బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధి బీడీరెడ్డిగార్డెన్‌ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు నరకం చవిచూస్తున్నారు. ఈ చౌరస్తా నుంచి సాగర్‌ హైవే, చైత్యనగర్‌, జెడ్పీ రోడ్డు, మీర్‌పేట వైపు నుంచి వాహనదారులు జిగ్‌జాగ్‌గా వస్తుండడంతో ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తి గంటల తరబడి వాహనాలు స్తంభించిపోతాయి. ఒక్కోసారి వాహనదారుల నడుమ వాగ్వాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. –వనస్థలిపురం

డ్రైనేజీ.. లీకేజీ..



డివిజన్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీతో మురుగు రోడ్లపై పారుతుండటంతో దుర్గంధంగా మారుతుంది. నాగోలు డివిజన్‌ పరిధి సౌత్‌ ఎండ్‌ పార్కు కాలనీ ప్రధాన రహదారి మన్సూరాబాద్‌ ప్రభుత్వ హాస్పిటల్‌ ఎదుట గత కొన్ని రోజులు డ్రైనేజీ మురుగు రోడ్లపై పారుతుంది. ఈ సమస్యలపై జలమండలి, సివరేజీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. –మన్సూరాబాద్‌

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ విడుదల చేయాలి



దిల్‌సుఖ్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు

మలక్‌పేట: ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌లను వెంటనే అమలు చేయాలని బుధవారం పీడీఎస్‌యూ గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్‌ అధ్యక్షుడు మంద నవీన్‌ మాట్లాడుతూ.. విద్యార్థుల బలిదానాలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యారంగాన్ని విస్మరించిన కేసీఆర్‌ను గద్దె దింపి, కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగంపై సమీక్ష జరుపలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్‌ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తూ.. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పాలకులు మారినా విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌ జామ్‌ అయింది. కార్యక్రమంలో శ్యామ్‌, సజా,రమేష్‌ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల ఇలా.. టమాట రూ.43, వంకాయ రూ. 35, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 23–35, కాకర రూ. 38, బీర రూ.45, క్యాబేజీ రూ.25, ఫ్రెంచి బీన్స్‌ రూ. 145, క్యారెట్‌ రూ.53, దొండ రూ. 28–35, చిక్కుడు రూ. 65, గోకర రూ. 35, బీట్‌రూట్‌ రూ. 32, క్యాప్సికం రూ. 75, ఆలు రూ. 37, దోస రూ. 35, సొర రూ. 17, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 45, చామగడ్డ రూ. 45. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

వనస్థలిపురం: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆటోనగర్‌లోని హరిణ వనస్థలి పార్కులో నిర్వహిస్తున్న పద్మశాలి దసరా మేళాకు హాజరు కావాలని పద్మశాలి సంఘం నాయకులు బుధవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పున్నా గణేష్‌ నేత, రవితేజ, లక్ష్మీనారాయణ, రవీందర్‌, జగన్నాథం పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితుల పిల్లలకు ‘రెసిడెన్షియల్‌’లో అడ్మిషన్‌

చైతన్యపురి: మూసీ ప్రక్షాళనలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్‌ పాఠశాలలో ప్రవేశం కల్పించారు. జీహెచ్‌ఎంసీ అర్బన్‌ కమ్యూనిటీ విభాగానికి చెందిన పీఓలు, ఆర్‌పీఓల కృషితో సోషల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలలో ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా ప్రవేశం కల్పించినట్లు సీఓఆర్‌ఓ ఓ ప్రకటనలో తెలిపారు. సరూర్‌నగర్‌ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషన్‌ ఇనిస్టిట్యూట్‌లో మాధవి (ఏడవ తరగతి), శిరీష (5వ తరగతి), తేజస్వి (5వ తరగతి)లో యూసీడీ అడిషనల్‌ కమిషనర్‌ చంద్రకాంత్‌రెడ్డి ఎడ్యుకేషనల్‌ సొసైటీ సెక్రటరీ ప్రశాంతితో మాట్లాడి ఉచిత విద్య పొందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు.

కుంగిన రోడ్డు.. పట్టించుకోని అధికారులు



కుంగిన రోడ్డు వద్ద కర్ర పెట్టిన దృశ్యం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌లోని సాయినగర్‌, సత్యనారాయణపురం, ప్రభాత్‌నగర్‌ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో కంకరతేలి ప్రమాదకరంగా మారుతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌ పరిధిలో ఏ రోడ్డు చూసినా ఇదే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. సాయినగర్‌ కాలనీ శివాజీ చౌక్‌ నుంచి సత్యనారాయణపురం కాలనీకి వెళ్లే రహదారి నడిరోడ్డు కుంగిపోయింది. గొయ్యి ఏర్పడటంతో గమనించిన స్థానికులు ప్రమాద సూచికగా ఓ కర్రను పాతి పెట్టారు. వారాల తరబడి అలాగే ఉన్నా మరమ్మతులు దేవుడెరుగు కనీసం ప్రమాద సూచికలైనా ఏర్పాటు చేయకపోవడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

రోడ్లపై చెత్త వేయొద్దు



చెత్త తరలింపు పనులు పరిశీలిస్తున్న పవన్‌కుమార్‌

నాగోలు: కాలనీల్లోని రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని కొత్తపేట కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ సూచించారు. బుధవారం ఆయన డివిజన్‌ పరిధిలోని మారుతినగర్‌, ప్రభాత్‌నగర్‌ కాలనీల్లో పర్యటించారు. కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డుమార్గంలో వ్యర్థాలు పారబోస్తుండటంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు కార్పొరేటర్‌ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత సిబ్బందితో చెత్త తరలించి ఈ ప్రాంతంలో మళ్లీ చెత్త వేయకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని శానిటైజేషన్‌ డీఈ చందనను కోరారు. ఇష్టానుసారంగా చెత్త వేస్తే భారీ జరిమానా విధించాలన్నారు. కార్పొరేటర్‌ వెంట మల్లేష్‌, సరోజినీ, జీహెచ్‌ఎంసీ అధికారులు బుచ్చయ్య, ప్రేమ్‌, విజయ భారతి ఉన్నారు.

రేపు కార్లకు వేలం పాట

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్‌ ప్రొహిబిషన్‌, ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 4 కార్లను ఈ నెల 18(రేపు) ఉదయం 10.30కు సరూర్‌నగర్‌ ఎక్సైజ్‌ పోలీస్‌ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు సరూర్‌నగర్‌ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

బాణాసంచా దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి



రాజు

చాదర్‌ఘాట్: నగర పోలీస్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు దీపావళి సందర్భంగా తాత్కాలిక బాణాసంచా విక్రయ దుకాణాల కోసం ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలని చాదర్‌ఘాట్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను పరిశీలించి ఆయా డీసీపీల ద్వారా లైసెన్స్‌లు జారీ అవుతాయన్నారు. డివిజనల్‌ ఫైర్‌ ఆఫీసర్‌ నుంచి, ప్రభుత్వ స్థలమైతే జీహెచ్‌ఎంసీ నుంచి, ప్రైవేటు వ్యక్తుల స్థలమైతే ఆయా యజమాన్యాల నుంచి ఎన్‌ఓసీ, అగ్రిమెంట్‌ కాపీలు, గతేడాది జారీ చేసిన లైసెన్స్‌ ఉంటే ఆ కాపీని జతపర్చాలన్నారు. సింగిల్‌ దుకాణం అయితే పక్కవారి నుంచి ఎన్‌ఓసీ, షాప్‌ సైట్‌ ప్లాన్‌ రూ.600 లైసెన్స్‌ ఫీజు గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీహెచ్‌లో హెడ్‌ అకౌంట్‌లో జమ చేయాలని సూచించారు. డాక్యుమెంట్లు దరఖాస్తుతో పాటు లేకుంటే ఆయా అర్జీలను తిరస్కరిస్తామన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కానుకల అందజేత



కార్మికులకు కానుకలు అందజేస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: దసర పండుగ పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులకు మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ..పరిసరాల పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్‌ శ్రీనివాస్‌, సూపర్‌వైజర్లు, కాలనీవాసులు రామస్వామి, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, నాయకులు ఎల్లారెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నాగోలు: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్‌ శ్రీశంకర్‌ కాలనీలో నివాసముండే సోమ రోహిత్‌కుమార్‌(36) సోమ ప్రియాంక భార్యాభర్తలు. వారికి ఒక కుమార్తె ఉంది. రోహిత్‌కుమార్‌ గత కొంతకాలంగా రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తున్నాడు. ఈ వ్యాపారంలో డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. ఇటీవల భార్యాభర్తలు ఎల్‌బీనగర్‌ సూర్యోదయ కాలనీలో ఉన్న ప్రియాంక తల్లి వద్ద వెళ్లి కొన్ని రోజులుగా ఉంటున్నారు. ఈ నెల 15న రోహిత్‌కుమార్‌ తనకు బ్యాంక్‌లో పని ఉందని చెప్పి బయటకు వెళ్లాడు. భార్య ఫోన్‌ చేయగా పది నిమిషాల్లో వస్తానని చెప్పాడు. ఆ తర్వాత స్విచ్ఛాఫ్‌ వచ్చింది. ప్రియాంక అత్త ఫోన్‌ చేసి తన డెంటల్‌ స్కానింగ్‌ రిపోర్టు పంపమని చెప్పడంతో ప్రియాంక, శ్రీశంకర్‌ కాలనీలో తమ ఇంటికి వెళ్లి తన దగ్గర ఉన్న రెండవ తాళం చెవితో తలుపు తెరవగా రోహిత్‌కుమార్‌ బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్థిక సమస్యల కారణంగానే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని ప్రియాంక ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



డీసీ యాదయ్యకు సమస్యలను వివరిస్తున్న నవజీవన్‌రెడ్డి

లింగోజిగూడ: కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హయత్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ క్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు.డివిజన్‌ పరిధిలోని శ్రీనివాస్‌ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్‌ దృష్టికి తీసుకురావడంతో బుధవారం ఆయన సంక్షేమ సంఘం నాయకులతో కలిసి హయత్‌నగర్‌ సర్కిల్‌ డీసీ తిప్పర్తి యాదయ్యను కలిసి సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రధానంగా డ్రైనేజీ, మంచినీటి సమస్యలతో నానా ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీసీని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ నాయకులు సుదర్శన్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్‌, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పారంద మహేష్‌ పాల్గొన్నారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సూర్యనాయక్‌

నాగోలు: ప్రస్తుత కాలంలో కొత్త కొత్త పద్ధతుల ద్వారా నేరాలు జరుతున్నాయని ప్రజలు అప్రమత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాగోలు ఇన్‌స్పెక్టర్‌ సూర్యనాయక్‌ అన్నారు. బుధవారం రాత్రి నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో నాగోలు నుంచి సాయినగర్‌ వరకు విజిబుల్‌ పోలీసింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనాయక్‌ మాట్లాడుతూ.. సైబర్‌ ట్రాఫికింగ్‌, మానవులు అక్రమ రవాణా, తదితర వాటిపై అవగాహన కల్పించారు. మొబైల్‌ ఫోన్‌లో ఆన్‌లైన్‌ యాప్స్‌ వాడుతున్న వారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్‌ నేరగాళ్లు రకరకాల యాప్స్‌ ద్వారా యువతులను వేధిస్తున్నారన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలు జరిగితే వెంటనే సమీపంలోని పోలీస్‌ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శివనాగప్రసాద్‌, ఎస్‌ఐ హీనాషేక్‌, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతర్‌.. పైసా వసూల్‌

- నివాస బహుళ అంతస్తుల్లో హాస్టళ్లు
- ట్రేడ్‌ లైసెన్స్‌ లేకుండానే నిర్వహణ
- ప్రభుత్వ ఆదాయానికి గండి



నివాస భవనాల్లో..

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌, మూసారంబాగ్‌, గడ్డిఅన్నారం ప్రాంతాల్లో ప్రైవేటు హాస్టళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలకు పాతరేసి హాస్టళ్ల నిర్వాహకులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఫ్రీ వైఫై, ఫ్రీ జిమ్‌ ఇలాంటి ఆఫర్లు పెడుతూ.. కమర్షియల్‌ బిల్డింగ్‌లలో కాకుండా నివాస ప్రాంతాల్లోని బహుళ అంతస్తుల భవనాల్లో హాస్టళ్లను ఏర్పాటు చేస్తూ బల్దియాకు రావాల్సిన రూ.లక్షల ఆదాయాన్ని ఎగ్గొడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు పాటించకుండా కొందరు కనీస సౌకర్యాలు కల్పించకుండానే హాస్టళ్లను కొనసాగిస్తున్నారు.

ట్రేడ్‌ లైసెన్స్‌ లేకుండానే..

మలక్‌పేట పీఎస్‌ పరిధిలో దిల్‌సుఖ్‌నగర్‌, గడ్డిఅన్నారం, మూసారంబాగ్‌, ఆస్మాన్‌ఘడ్‌ ప్రాంతాల్లో వందల సంఖ్యల్లో ప్రైవేట్‌ హాస్టళ్లు కొనసాగుతున్నాయి. సరైన సదుపాయాలు, కొన్ని చోట్ల వాచ్‌మెన్‌ లేకపోవడంతో పాటు ఇతర రక్షణ చర్యలు ఉండవు. నివాస ప్రాంతాల్లోని బహుళ అంతస్తు భవనాల్లో హాస్టళ్లు ఏర్పాటు చేసి కోచింగ్‌లు, ఉద్యోగాల కోసం వచ్చిన వారి నుంచి ఫీజుల రూపంలో భారీగా వసూలు చేస్తున్నారు. హాస్టళ్లు ఏర్పాటు చేయాలంటే జీహెచ్‌ఎంసీ లైసెన్స్‌, ఫైర్‌శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, ఏ ఒక్కరూ కూడా లైసెన్స్‌ తీసుకోకుండా స్థానిక నాయకుల అండదండలతో కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమర్షియల్‌ భవనాల్లో హాస్టళ్లు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. ఇలా చేస్తే ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. దీనిని తప్పించుకునేందుకు నివాస ప్రాంతాల్లో హాస్టళ్లు ఏర్పాటు చేస్తున్నారు. హాస్టళ్లల్లో బ్యాచిలర్‌ ఉద్యోగులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు ఎక్కువగా ఉంటున్నారు. వారి ఐడీ కార్డు, ఆధార్‌ కార్డు పూర్తి వివరాలు తీసుకుని భద్రత పర్చాలి. సంబంధిత పోలీసులకు వివరాలు అందజేయాల్సి ఉండగా వాటిని సైతం విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తీవ్రంగా డ్రైనేజీ సమస్య ..

దిల్‌సుఖ్‌నగర్‌, గడ్డిఅన్నారం ప్రాంతాల్లో ప్రైవేట్‌ హాస్టళ్ల నిర్వహణతో తీవ్రమైన డ్రైనేజీ సమస్య తలెత్తుతోంది. నివాస సముదాయాల్లో హాస్టళ్లు ఏర్పాటు చేయడంలో జనాభా పెరగటం మూలంగా పైపులైన్లలో మురుగు నీటి ఉధృతి ఎక్కువై డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల వద్ద మురుగు పొంగిపొర్లుతోంది. అంతేగాక వ్యర్థాలు డ్రైనేజీలో వేస్తుండటంతో డ్రైనేజీ జామై ఆయా ప్రాంతాల్లోని రోడ్లపై మురుగు ఏరులై పారుతూ దుర్గంధంగా మారుతున్నాయి.

మూసారంబాగ్‌లోని ఓ ప్రైవేట్‌ హాస్టల్‌

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే..



ఇటీవల నేను బాధ్యతలు తీసుకున్నాను. పూర్తి వివరాలు అందుబాటులో లేవు. అవసరమైతే ప్రైవేట్‌ హాస్టళ్లపై స్పెషల్‌ డ్రైవ్‌ చేపడుతాం. ట్రేడ్‌ లైసెన్స్‌ లేని వారికి జరిమానా విధిస్తాం. ప్రతి ఒక్కరూ ట్రేడ్‌ లైసెన్స్‌ తీసుకునేలా అవగాహన కల్పిస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

–అనురాధ, ఏఎంహెచ్‌ఓ, సర్కిల్‌–6

ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ విజయ్‌ శ్రీనివాస్‌

విజయనగర్‌కాలనీ: ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆసిఫ్‌నగర్‌ పోలీస్‌ డివిజన్‌ ఏసీపీ విజయ్‌ శ్రీనివాస్‌ అన్నారు. బుధవారం ఆసిఫ్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మందిర్‌, మసీద్‌ కమిటీ ప్రతినిధులతో ఆసిఫ్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ఇటీవల పలు ఆలయాల వద్ద జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా మందిర్‌, మసీదుల కమిటీ సభ్యులు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమైన ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నిరంతర నిఘా ఉండేలా చూడాలన్నారు. బస్తీలు, కాలనీలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా మైత్రీ పీస్‌ కమిటీ సభ్యులు తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.వెంకటేశ్వర్లు, మైత్రి కమిటీ అధ్యక్షుడు యాసీన్‌ అలీ, ప్రధాన కార్యదర్శి అశ్వాక్‌ అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

బాలికలలో మానసిక దృఢత్వాన్ని పెంపొందింపజేయాలి

నాంపల్లి: బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు, అత్యాచారాలను, అనర్థాలను ఎదుర్కొనేందుకు వారిలో మానసిక దృఢత్వాన్ని పెంపొందింపజేయాలని తెలంగాణ సైకలాజికల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్‌ సైకాలజిస్ట్‌ డాక్టర్‌ ఎం.ఏ.కరీం అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వారోత్సవాల ముగింపు సభ బుధవారం నాంపల్లిలోని అసోసియేషన్‌ కార్యాలయంలో సీనియర్‌ సిటిజన్స్‌కు వయోవృద్ధ సమస్యలపై మానసిక నిపుణులతో సైకలాజికల్‌ క్యాంప్‌ నిర్వహించారు. దానికి తోడుగా బాలికల భద్రతకు భరోసా అనే అంశంపై మానసిక ఆరోగ్య సదస్సును నిర్వహించారు. సమాజంలో బాలికలు, యువతులు ఎదుర్కొంటున్న అసమానతలను, అవమానాలను తొలగించి వారికి విద్య, వైద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, సంరక్షణ, స్వీయ రక్షణతో పాటు వారిలో ఆత్మ విశ్వాసం పెరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైకలాజికల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్‌ ఎ.రాకేష్‌ కుమార్‌, డాక్టర్‌ కృష్ణ గోపాల్‌ భండారి, శివ, భాస్కర్‌, సీనియర్‌ సిటిజన్స్‌, బాలికలు పాల్గొన్నారు.

విద్యుత్‌ వైర్‌ చోరీ.. వ్యక్తి రిమాండ్‌

నాగోలు: విద్యుత్‌ వైర్లు దొంగించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు జైపురికాలనీ, ఫ్రెండ్స్‌ కాలనీలో మొహమ్మద్‌ రియాజుద్దీన్‌ అన్సారీ నూతన భవనం నిర్మాణం చేస్తున్నాడు. ఈ నెల 15న నిర్మాణం వద్ద వెళ్లి చూసేసరికి 15 కట్టల విద్యుత్‌ వైర్లు కనిపించలేదు. భవనం వద్ద నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న సువిత్‌ తండన్‌పై అనుమానం వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 35 కిలోల విద్యుత్‌ వైర్లు, రూ. 25 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

స్వచ్ఛతపై సమీక్ష సమావేశం

ఉప్పల్: చిలుకానగర్‌ను చెత్త రహిత డివిజన్‌గా మార్చేందుకు కలిసికట్టుగా పనిచేయాలని చిలుకానగర్‌ కార్పొరేటర్‌ బన్నాల గీతా ప్రవీణ్‌ముదిరాజ్‌ ఉప్పల్‌ సర్కిల్‌ శానిటరీ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు బుధవారం వార్డు కార్యాలయంలో సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. జీవీపీ పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ అసోసియేషన్లు ముందుకు వస్తున్నట్లు వివరించారు. వారి సహకారంతోనే సీసీ కెమెరాలను అమర్చుకుందాం అని పిలుపునిచ్చారు. శానిటరీ సిబ్బంది ఎలాంటి అలసత్వం లేకుండా వ్యర్థాలను తొలగించాలని సూచించారు. బన్నాల ప్రవీణ్‌, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.